

# దొంగలు

పీలా శివరామ్

నెలవంక మసక వెన్నెలని కురిపిస్తూ మిందిని పరుగెడుతూంటే, ఆ పేటకి కొసగానున్న సిమెంటుగోడల పూరింటి వాకిటిలో మునగచెట్టునీడ, జామచెట్టు నీడ సయ్యాట లాడుతున్నాయి పగ లంతా కాసిన ఎండ తీవ్రతకి అలసిన ప్రాణులు ఆరుబయట, చల్లగాలిలో వళ్ళుమరచి, ప్రాణాలులేని కట్టెల్లాగా నిద్రావస్థలో వున్నారు. పూరింటి కుడి భాగంలోని సుందరమ్మ. శంకరయ్యలు చెరో పట్టెమంచం, దూరదూరంగా వీధి వాకిటిలో వేసుకుని, ఊసులాడి, ఆడి, అలసిపోయి, నిద్రలోకి జారిపోయారు. ఎడమభాగం వాకిలిముందర గోవిందయ్య చిత్ర విచిత్రాలుగా గుర్రుపెడుతూ నిద్ర పోతూంటే, నాలుగేళ్ళ ఎకపిల్లనిపక్కలో

వేసుకని, భర్త గురకలకి విసు క్కుంటూ నిద్రాదేవి ఒడిలో వాలిపో యింది ఆండాళ్ళు.

వీధి చివరన ఊరకుక్కలు ఏడ్చి ఏడ్చి అలసినట్లుగా నిశ్శబ్దంగా వుండి పోయినాయి. మసక వెన్నెల్లో, మను షుల, జంతువుల నీడలు ఒక్కలాగానే వున్నాయి.

గాఢనిద్రలో నున్న సుందరమ్మ మెడలో ఎవరిదో చెయ్యి కదిలినట్లయి, పక్కకు వత్తిగిల్లుతూ, ఎవరది ? అంది నిద్రలో తూగిపోతున్న గొంతుతో.

నేనేలే : నేనే ! అంది మెల్లనికంఠం

నిద్రొస్తాంటే ఏంటి గొడవ ? అంటూ గొణుగుతూ నిద్రలో మునిగిపోయింది. సుందరమ్మ వీపుమీ చేతిని పక్కకి నెట్టుతూ.

భళ్లున తెల్లవారింది. సూర్యభగవా నుడు కొంటెపిల్లాడిలాగా, చరచరా నడిమింటి కెక్కిపోతున్నాడు. సుంద రమ్మ ఇల్లంతా తిరగతోడి వెతికింది వెతికినట్టే వుంది. శంకరయ్య సుంద రమ్మ తిరగేస్తున్న వస్తువుల్ని యథా స్థానంలో సర్దుతూ, సర్దుతూ అలసి పోయాడు.

'చెపుతుంటే నమ్మవేం ? మొన్న సావిత్రమ్మ కూతురి సవర్త పేరంటానికి వెళ్లొచ్చి, ఆ చంద్రహారాన్ని అట్టాగే మెడలో వుంచుకున్నాను. తీద్దాం, తీద్దా మనుకుంటూనే అశ్రద్ధయిపోయింది,' ముక్కుచీదుతూ, కళ్ళమ్మటకారే గంగా ప్రవాహాన్ని ఆపలేకపోతోంది సుందరమ్మ

మరేవయినట్టే ! అయినా నిన్న సాయంత్రంగూడా నీమెడలో ఆ గొలుసు చూసిన గుర్తేనే ! అంటున్నాడు నిస్స హాయంగా శంకరయ్య.

'నువ్వో పిచ్చిమాలోకానివి. సాయం త్రంవేంటి, రాత్రిగూడా వుండేనూ ఓ రాత్రివేళ నువ్వొచ్చి మీద చెయ్యే సినావా ! ఎవరంటే నేనే నంటివా ! అప్పుడుగూడా నా దేయి గొలుసుమీది కెళ్ళిన గుర్తుంది. ఒకటా రెండా పదేను తులాల గొలుసు' అంటూ మరోసారి రాగంతీసింది సుందరమ్మ.

శంకరయ్య గబుక్కున ఎగిరిపడ్డాడు. 'ఏవిటేవిటి ?' మధ్య రాత్రేళ నేను నీ మీద సెయ్యేసినానూ ? పైగా ఎవరంటే నేనే నన్నానూ ! నీకేం మతిగానీ పోలేదు గదా ? అంటూ ఎగిరాడు శంకరయ్య.

సుందరమ్మ ఏడవటం మాని. కన్ని శ్ళమధ్యనించి శంకరయ్యని చీదరగా చూసి 'ఛ ! అబద్ధాలాడమోక' అంది ముక్కు ఎగచీలుస్తూ

'వొట్టే సుందరం ! రాత్రంతా కట్టు కొయ్యలా పడుంటే నీ దగ్గర కెప్పు డొచ్చానే ? అయితే అది ఏ దొంగ సచ్చినాడి పనో అయ్యుంటుందే సుంద రం' అన్నాడు ఏడుపు తరువాయిగా.

'మరి నా మెడలో సెయ్యేసినపుడు మెలుకువొచ్చి ఎవరది ? అంటే నేనే

నంటివి కావూ ?' అంది సుందరమ్మ అనుమానంగా.

'సత్తె ప్రెమాణంగా నేకాదంటే నమ్మ దావేం ?' అన్నాడు శంకరయ్య రుద్రయ్యలాగా.

'ఓరి నాయనో ! నా పక్కన తొంగుంది నువ్వేగాదూ ! సుందరమ్మ గుండెలు బాదుకుంటూ రాగం తీసింది,

శంకరయ్య చూరుకి తగిలేట్టుగా ఎగిరిపడ్డాడు.

'నీ దుంపతెగ ! ఎంత పనిచేశావే ? ఇంకేం చేశాడే దొంగసచ్చినోడు' అన్నాడు గుండెలు గుబగుబలాడు తుండగా.

'నామీద సెయ్యేసింది నువ్వేగాదూ ? నా పక్కన తొంగుంది నువ్వేగాదూ ?' అంటూ శోకాలు పెడుతోంది సుందరమ్మ

ఇంకేం చేసి సచ్చాడో చెప్పమంటే చెప్పిదావేం ! అంటూ అరిచాడు శంకరయ్య.

'ఇంకేటి చేసేది ? నీ తలకాయ ఓర్నాయనో, నా గొలుసు కాస్తా తెంపుకు పోయినాడు నాయనోయ్ ! పదేను తులాల గొలుసు దేవుడోయ్' అంటూ శోకాలు తీస్తోంది సుందరమ్మ.

'నీ గొలుసు తగలెయ్య ! ఆ దొంగ సచ్చినాడు ఇంకేం జేశాడే ? మీద సెయ్యేసి, పక్కన తొంగున్నాడా ! ఓర్నాయనో ! నీ జనమతోగలద ! ఇంకేం జేసినాడే మొద్దు నిద్దురదానా ?' అంటూ గంతులేస్తున్నాడు గోవిందయ్య కల్లుతాగి నిప్పుతొక్కిన కోతిలాగా.

నడిమింటి గోడ పక్కగా నక్కి వింటున్న ఆండాళ్ళు వచ్చే నవ్వు నాపుకోలేక సతమత మవుతూంటే ! గోవిందయ్య హఠాత్తుగా ఏదో తట్టినట్లుగా నిటారుగ నిలబడ్డాడు.

'ఇంకేం జేశాడే దొంగ సచ్చినోడు ?' అంటూ అరుస్తున్నాడు శంకరయ్య.

'ఓర్నాయనో పదేను తులాల గొలుసు రోయ్ దేవుడా ! మూడుపేటల చంద్రహారంరోయ్ నాయనా ! నేనేం జేతురోయ్ తండ్రీ', బెంగమొహం వేసుకుని సుందరమ్మ శోకాలు పెడుతుంటే ఆండాళ్ళు మరింతగా గోడ కంటుకుని నిలబడి వింటుంది.

'మాయదారి సచ్చిందానా ! యెవడో యెదవొచ్చి, వొళ్ళో తొంగుంటే తెల్సిసావలేదటే లంజకానా ! పైగా గొలుసు గొల్సని రాగాలీస్తావటే రంకుముండా' అంటూ బలంగా సుందరమ్మ వీపుమీద దభీ, దభీ గుద్దులవాన కురిపించాడు శంకరయ్య.

'ఒలమ్మో. ఓర్నాయనో నాగొలుసు అంటూ పూరింటికప్పు యెగిరిపోయేట్టుగా ఏడుస్తోంది సుందరమ్మ.

* * *

'బాగానే వుంది భాగోతం. వాళ్ళకాలి ఒహదేడి, దేశిల్లుకాలి మరొహ దేడ్చాట్ట ! అందుకే నా 'సైకిలు చెయిను' గొల్సు తీసి భద్రంగా పెట్టెంలో దాచేది ! చల్లగాల్లో ఆరుబయల్లో, నడుం వాలుస్తే

ప్రాణాలు ఎక్కడికో యెగిరిపోతాయయ్యే! ఇంట్లో దొంగలుపడి దోచుకుపోయినా, మెలుకువే రాదు! ఆమాత్రం జాగ్రత్త లేకపోతే ఎట్లా! బంగారాన్ని సింగారించుకుంటేతప్ప నిద్రరానంటావ్! మాబాగా జరిగింది. పాపం సుందరమ్మ పాలు పిడతల సొమ్మంతే ఏదొంగవెధవ పాలో అయింది.' అనుకుంటూ అండాళ్లు పెట్టె దగ్గరికి నడిచి, పుస్తెలతాడులో వున్న చిన్న తాళం చెవితో పెట్టెతాళం తియబోయిందల్లా తేలుకుట్టినట్టుగా ఎగిరి పడింది. పెట్టెతాళం తెరవబడి, కొక్కానికి వేళ్ళాడుతోంది!

''ఓర్నాయనోయ్, ఏవండోయ్! ఎక్కడ?" గుండెలు బాదుకుంటూ గంతులేసింది అండాళ్ళు.

"ఏమిటీ? ఏమిటి బంగారు" తల దువ్వుకుంటూ, ఇస్త్రీలాల్చీ మడతలు సర్దుకుంటూ వచ్చాడు గోవిందయ్య.

"నా గొలుసండీ, నా సైకిల్ చెయినండీ", మూడుపేటల గొలుసండీ! అంటూ బావురుమంది.

"ఏమిటే? ఏమయింది నీ గొల్సు? పెట్లో లేదా? సరిగ్గా వెతికావా?, అంటూ పెట్టంతా బోర్లించి చీర చీర సందున వెతికాడు గోవిందయ్య.

"ఇక్కడే వెతికానండీ! పనివేళా రాత్రి తీసి, ఈ రేకుపెట్టెలో పెట్టి, బట్టలడుగున దాచానండీ! ఓరి భగవంతుడా నా గొలుసురోయ్" అంటూ శివమెక్కిన దానిమల్లే ఏడుస్తోంది అండాళ్లు.

అసలు ఇక్కడ పెట్టినట్లుగా గుర్తుందా నీకు? పెడితే ఏమవుతోందే? యక్షిణీ దేవతగానీ మింగిందా? అన్నట్టు పెరటి తలుపులు తీసి వున్నాయేమే! తెల్లవారి లేనిమూస్తే తీసింది నీవు గదా ఏం?" అన్నాడు గోవిందయ్య తత్తరగా.

"మరింక చెప్పరేవండీ బాబోయ్! ఆ దొంగవెధవే పెరటిదోవన వచ్చి పట్టుకుపోయింటాడండీ. అయ్యో దేవుడా? ఏం చేసేదిరోయ్! పదికాసుల సైకిలు చెయినండీ! మా నాయనమ్మ చచ్చిపోతూ ఇచ్చిందండోయ్" అంటూ గొల్లుమంది అండాళ్ళు.

"ఔరా ఒకింట్లో రెండు దొంగతనాలా! ఎంత గుండెల్దీసిన బంటుగాడూ దొంగవెధవ! ఇంకేం పోయాయో చూడు. నేనట్లాపోయి పోలీస్‌స్టేషన్లో రిపోర్టిచ్చి వస్తా. ఇట్లాటి దొంగవెధవల్ని ముక్కలు విరగదన్ని, కిలకీలు పూడదియ్యాలి. అంటూ పరుగు పరుగున బయటకి జారుకున్న గోవిందయ్య వీధి మలుపు తిరగ్గానే, బరువుగావున్న లాల్చీ జేబు తడుముకుంటూ ఆనందంగా నవ్వుకున్నాడు. మెత్త మెత్తగా చేతికి తగిలిన 'సైకిలుచెయిన్ని' మరింత భద్రంగా పట్టుకున్నాడు. మై లేడీ, హనీకూంబే, గ్లాయర్‌ల్వేన్‌లు, లక్కీలూసీలు డెక్కలు టకటక లాడిస్తూ కళ్ళ ముందు వామవేగ మనోవేగాలతో పరుగెడుతూంటే, రాయితగిలి బొర్లాపడ్డాడు గోవిందయ్య.